# త్రిశంకు స్వర్గంలో ఉన్నత విద్య..!

**పెరుగుతున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఉన్నత విద్యలో ఆశించిన ప్రమాణాలు అందుకోలేకపోతున్నాం. వృత్తి విద్యా కోర్సు సీట్లలో మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వాటా 60 శాతం. కానీ.. దేశ జనాభాలో ఈ రాష్ట్రాల వాటా నాలుగో వంతు మాత్రమే. అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిథ్యం ఉండాల్సిన ఉన్నత విద్యలో కేవలం కొన్ని రాష్ట్రాల ఆధిపత్యం కొనసాగుతుండటం.. ప్రాంతీయ అసమానతలకు తద్వారా దేశ అస్థిరతకు దారితీసే ప్రమాదం ఉంది.**

విజ్ఞాన రంగంలో ఉన్నత శక్తిగా ఎదగాలని ఉవ్విళ్లూరుతున్న భారత దేశం.. ఉన్నతవిద్యలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పలేకపోతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన విద్యాసంస్థలకు దీటుగా...మన కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, ఐఐఎంలు ఎందుకు ఎదగలేకపోతున్నాయో మనమంతా ఆత్మావలోకనం చేసుకోవాలి. స్వాతంత్ర్యం వచ్చిన మొదటి దశాబ్దంలో విద్యారంగంలో వర్ధమాన దేశాలకు నాయకత్వం వహించి, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద శాస్త్రీయ, సాంకేతిక నిపుణులను తయారు చేసిన మనం ప్రస్తుతం చైనా, సింగపూర్, ఇతర ఆఫ్రో- ఆసియా దేశాల కంటే వెనుకబడి ఉండటం బాధాకరం. రాధాకృష్ణన్ కమిషన్ నుంచి.. నేటి నాలెడ్జ్ కమిషన్ వరకూ ఎన్నో కమిటీలు సిఫార్సులు చేసినా.. విద్యారంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకోలేదు.

### ఇవీ కారణాలు...

పాఠశాల విద్యను పొందుతున్నవారిలో పది శాతం కంటే తక్కువ మంది మాత్రమే ఉన్నతవిద్యను అభ్యసించగలుగుతున్నారు. వనరుల కొరత, మౌలిక సదుపాయాల లోపం,సమర్థులైన ఉపాధ్యాయులు లేకపోవడం తదితర కారణాల వల్ల విద్యా రంగంలో ప్రమాణాలు రోజురోజుకీ దిగజారుతున్నాయి. ఏటా లక్షకుపైగా భారతీయ విద్యార్థులు.. దాదాపు నాలుగు బిలియన్ డాలర్లను విదేశాల్లో ఉన్నత విద్య కోసం వెచ్చిస్తున్నారు. బ్రిటిష్ కాలం నాటి విద్యావిధానాన్నే నేటికీ మనదేశంలో కొనసాగిస్తుండటమే దీనికి కారణం. చదివే చదువుకు... చేస్తున్న ఉద్యోగానికి పొంతన ఉండటం లేదు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే విద్యాబోధన లేదు. పరిశ్రమలు, విద్యాసంస్థలను అనుసంధానించి వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా బోధన చేపట్టాలి.

### బోధన కాదు.. బట్టీ :

విషయ అవగాహన కంటే కంఠస్థం చేయడానికే మన విద్యా విధానం ప్రాధాన్యమిస్తోంది. మన పరీక్షలు జ్ఞాపకశక్తిని పరీక్షిస్తున్నాయి తప్ప, తరగతి గదిలో నేర్చుకున్నది నిజజీవితంలో ఎలా ఉపయోగపడుతుందో పరీక్షించడం లేదు. కుల, వర్గ, మత తారతమ్యాలు ఎక్కువగా ఉన్న సమాజంలో బీదలు, అల్పసం ఖ్యాక వర్గాలు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, బాలికలు ఉన్నత విద్య పట్ల ఆసక్తి చూపకపోవడంలో ఆశ్చర్యం లేదు. 'భారత దేశం తన స్థూల జాతీయోత్పత్తిలో 0.37 శాతాన్ని మాత్రమే ఉన్నతవిద్యకోసం కేటాయిస్తుంటే.. బ్రెజిల్ 0.91, చైనా 0.5 శాతం అందిస్తున్నాయి'. ''ఉన్నత విద్య – ప్రపంచీకరణ'' అనే అంశంపై ఎర్నెస్ట్ అండ్ యంగ్ అనే సంస్థ విడుదల చేసిన గణాం కాలివి.అలానే విద్యార్థులు- ఉపాధ్యాయుల సగటు నిష్పత్తి రష్యాలో 11:1 శాతం, బ్రెజిల్‌లో 13.6:1, చైనాలో 13.5:1, ఇండియాలో 26:1. దీనిని బట్టి సంఖ్య, నాణ్యత పరంగా మనం ఉన్నత విద్యలో ఎంత వెనుకబడి ఉన్నామో అర్థమవుతోంది.

### ప్రమాణాలు లేని ప్రైవేటు విద్యా సంస్థలు :

ఉన్నత విద్య ప్రైవేటీకరణను కొంత మంది సమర్థిస్తుంటే.. మరికొంత మంది ప్రభుత్వ నియంత్రణలో ఉండాలని వాదిస్తున్నారు. 11 పంచవర్ష ప్రణాళికలో ఉన్నత విద్యకు భారీగా నిధులు కేటాయించడంతో పాటు... కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఐఐటీ, ఐఐఎంలలో సీట్ల పెంపు, వెనుకబడిన తరగతులకు ఉన్నత విద్యలో రిజర్వేషన్ సదుపాయం తదితర చర్యలు తీసుకుంటున్నారు. వీటివల్ల సంఖ్యాపరంగా మెరుగుదల కనిపించవచ్చు. కానీ, నాణ్యత విషయంలో ఎలాంటి మార్పులు వస్తాయో చూడాలి. 80మిలియన్ల విద్యార్థులు కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో చదువుతుంటే 3.5 మిలియన్ల మందికి దీని ద్వారా జీవనోపాధి లభిస్తుంది. ఉన్నత విద్యకు పెరుగుతున్న ఆదరణకు దీటుగా కళాశాలలను నెలకొల్పడం వర్ధమాన దేశాలకు సవాలుగా మారింది. ఉన్నత విద్యకు కావాల్సిన ఆర్థిక పెట్టుబడి, నిర్వహణ కష్టతరం కావడంతో ప్రైవేటు రంగానికి నెమ్మదిగా బదిలీ చేస్తున్నారు. ఉన్నత విద్యలో ఇటీవలి కాలంలో కార్పొరేటీకరణ, అంతర్జాతీయీకరణ కూడా ప్రారంభమైంది.

మన దేశంలో ఉన్నత విద్యాసంస్థలు రాశిపరంగా ఎక్కువవుతున్నా, నాణ్యత పెరగడం లేదు. మౌలిక సదుపాయాల లేమి, నిష్ణాతులైన ఉపాధ్యాయుల కొరత దీనికి ప్రధాన కారణాలు. రాజకీయ నాయకులు విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తూ, ప్రభుత్వ నియంత్రణను నీరుగారుస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు పోటీతత్వం పేరుతో విద్యార్థులపై మానసికంగా, శారీరకంగా ఒత్తిడిని పెంచుతున్నాయి. అయితే, విద్యారంగ అభ్యున్నతికి ప్రైవేటు రంగ తోడ్పాటు లేదనడం సరికాదు. అమెరికాలోని హార్వర్డ్, యేల్, స్టాన్‌ఫర్డ్ లాంటి విశ్వవిఖ్యాత విశ్వవిద్యాయాలు బోధన, పరిశోధనల పరంగా ఉన్నత ప్రమాణాలు కలిగి ఉండటమే కాకుండా.. శాస్త్రీయ సాంకేతిక రంగాల్లో సంభవించే అనేక విప్లవాత్మక మార్పులకు కేంద్ర బిందువులుగా మార

SAKSHI

డానికి కారణం.. పరిమిత ప్రభుత్వ జోక్యం, ఫెడరల్, రాష్ట్ర, వాణిజ్య కేంద్రాలు అందిస్తోన్న ఆర్థిక సాయం. ప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణలో నడిచే సంస్థలో నాణ్యత, అంకితభావం ఉండవని, ప్రైవేటు రంగం నాణ్యతకు, చిత్తశుద్ధికి మారుపేరనే దురభిప్రాయం సమాజంలో ఉంది. దీంతో ఉన్నత విద్య ప్రభుత్వ, మార్కెట్ వ్యవస్థల మధ్య 'త్రిశంకు స్వర్గంలో' వేలాడుతోంది. ఈ రెండిటి మధ్య సమతుల్యత అవసరం.

## విద్య... కొన్ని రాష్ట్రాలకేనా!

ఉన్నత విద్యారంగంలో ప్రైవేటు సంస్థలు కల్పిస్తున్న అవకాశాలు కేవలం ఇంజినీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్ రంగాలకే పరిమితమయ్యాయి. ఇంజినీరింగ్‌లో 80 శాతం సీట్లు, మెడిసిన్‌లో 50 శాతం సీట్లు ప్రైవేటు రంగంలోనే అందుబాటులో ఉండటంతో.. సంపన్న వర్గాలు మాత్రమే ఈ స్థాయిలో ఫీజులు చెల్లించగలు గుతున్నారు. అయితే ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తూ వీరికి విద్యా గంధాన్ని ఉచితంగా ప్రసాదిస్తోంది. విద్యారంగంలో ప్రైవేటుసంస్థల జోక్యం పెరగడంతో ప్రాంతీయ అసమానతలు కూడా ఎక్కువవుతున్నాయి. మహారాష్ట్ర, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోనే 60 శాతం ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఉన్నాయి. కేవలం 25% జనాభా కలిగిన ఈ రాష్ట్రాల్లో 60 శాతం వృత్తిపరమైన విద్యా సంస్థలు ఉండటం వృత్తిపరంగా విద్యారంగంలో అసమానతలకు దారి తీస్తోంది. దీనిపై ఐఐటీ కాన్పూర్ చైర్మన్ ప్రొఫెసర్. ఆనందకృష్ణన్ తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో 340 తమిళనాడులోను, ఏపీలో 565 ఉండటం క్రమేణా దేశ అస్థిరతకు దారితీస్తుందనేది ఆయన అభిప్రాయం. ప్రైవేటు వృత్తి విద్య కళాశాలలో పనిచేసే అధ్యాప కుల్లో చాలామంది కనీస అర్హతలు కూడా లేకుండా విద్యాబోధన చేస్తున్నారు. ఏఐసీటీఈ, ఎంసీఐ, ఎన్‌బీఐ, నర్సింగ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మొదలైనవి. వీటి నియంత్రణకు సరైన చర్యలు చేపట్టలేదు. ఈ విషయంపై జాతీయ నాలెడ్జ్ కమిషన్ ఆందోళన వెలిబుచ్చింది.

ప్రైవేటు రంగంలోని విద్యా సంస్థలను ట్రస్ట్‌లు, సొసైటీల ద్వారా నడుపుతున్నారు. ఇవి పేరుకు మాత్రమే లాభాపేక్ష లేని సంస్థలు. ఈ అంశాన్ని కారణంగా చూపి విలువైన భూమిని ప్రభుత్వం నుంచి చౌకగా పొంది, భారీ ఎత్తున డొనేషన్లు వసూలు చేస్తున్నాయి. సేవా దృక్పథానికి బదులుగా ధనార్జనే లక్ష్యంగా వ్యవహరించే ఇలాంటి సంస్థల వల్ల విద్యారంగానికి పెను ప్రమాదం ఉంది. అయితే పిలానీ, హైదరాబాద్‌లలో ఉన్న ''బిట్స్'' ''టాపర్ యూనివర్సిటీ'' (పాటియాల) ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తూ మిగతా ప్రైవేటు సంస్థలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

## భారతదేశంలో పాగా :

ప్రపంచీకరణ నేపథ్యంలో అభివృద్ధి చెందిన దేశాలు... అత్యున్నత ప్రమాణాలతో నడుస్తోన్న విద్యాసంస్థలను తమదేశంలోకి ఆహ్వానిస్తున్నాయి. విద్యారుల్లో వీటి పట్ల ఆకర్షణ పెరుగుతోంది. సింగపూర్‌లో 16 ప్రముఖ విశ్వవిద్యాలయాలు తమ అనుబంధ సంస్థలను ఏర్పాటు చేశాయి. అలాగే దుబాయి, ''విజ్ఞాన గ్రామం'' అనే పేరుతో ప్రముఖ విదేశీ విశ్వవిద్యాల యాలను ఆకర్షిస్తోంది. దోహా(ఖతార్) లో కార్నేజీ, కార్నెల్, టెక్సాస్, వర్జీనియా మొదలైన విద్యాసంస్థలు తమ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. 'ఆన్‌లైన్' ద్వారా అనేక విదేశీ విద్యాలయాలు విద్యార్థులకు తక్కువ ఖర్చుతో ఉన్నత విద్యను అందుబాటులోకి తెస్తున్నాయి. అయితే, వర్ధమాన దేశాలు ఈ పరిజ్ఞానాన్ని ఆశిం చిన స్థాయిలో వాడుకోలేకపోతున్నాయి. భారతదేశంలో ప్రైవేటు రంగం కార్పొరేట్ విద్యాలయాలను ఏర్పాటు చేసి సంప్రదాయ విశ్వవిద్యాలయాలు తీర్చలేని లోటును భర్తీ చేస్తున్నాయి. సమా చార సాంకేతిక రంగంలో ఇన్ఫోసిస్ 'క్యాంపస్ కనెక్ట్ ప్రోగ్రాం', విప్రో 'అకాడెమీ ఆఫ్ సాఫ్ట్‌వేర్ ఎక్సలెన్స్' ఇందుకు ఉదాహరణలు. సమాచార సాంకేతిక పరిశ్రమ (ఐటీ) ఈ రంగంలో నిపుణతలో ప్రమాణీకరణ సాధించడానికి ప్రయత్నిస్తోంది.

## ప్రైవేటీకరణ మితిమీరకూడదు!

సమాచార సాంకేతిక ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానరీతిలో అందుబాటులో లేకపోవడం, సమర్థులు విదేశాలకు తరలిపోతుండటం భారతదేశానికి ఆందోళన కలిగించే విషయాలే. దేశ రక్షణ, ఆంతరంగిక భద్రత, న్యాయ స్థానాలు, పోలీసు, విద్య తదితర రంగాలపై ప్రభుత్వ నియంత్రణ అవసరం. ముఖ్యంగా విద్యలాంటి సున్నితమైన రంగాలలో మితిమీరిన ప్రైవేటీకరణ, విదేశాల ప్రభావం దేశ భవిష్యత్తుకే ప్రమాదకరం. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య జాతీయ ఉత్పత్తిని పెంచడంతోపాటు సామాజిక ప్రగతికి దోహదం చేస్తుంది. ఆరోగ్యం, జనాభా నియంత్రణ, దారిద్ర్య నిర్మూలన, ఆదాయపంపిణీ, నేరాల తగ్గుదల, నూతన సాంకేతిక విజ్ఞానాన్ని త్వరితగతిన అమలు చేయడం, ప్రజాస్వామ్యం పటిష్టం కావడం మొదలైనవన్నీ గుణాత్మక విద్య ద్వారా లభిస్తాయి. ప్రభుత్వ నియంత్రణలో విద్య ఉన్నప్పుడే సమాజంలోని అన్ని వర్గాలకు ఈ ఫలాలు అందుతాయి.

అయితే, మితిమీరిన ప్రభుత్వ, రాజకీయ జోక్యంతో విద్యను ప్రైవేటీకరించాలనే వాదన పెరుగుతోంది. ప్రపంచ బ్యాంకు లాంటి అంతర్జాతీయ సంస్థలు 'ఉన్నత విద్య మీద పెట్టే ఖర్చును సాధారణ ప్రజానీకం మీద మోపటం తప్పు' అంటూ.. దీనికి ప్రైవేటీకరణే సరైన ప్రత్యామ్నాయమని వాదిస్తున్నాయి. 'విద్య కొందరికి మాత్రమే అందుబాటులో ఉండటం సామాజిక అంతరాలకు దారితీస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, మార్కెట్ భాగస్వామ్యంతో ఉన్నత విద్యను నిర్వహించడం మంచిదని' కొందరు మేధావుల అభిప్రాయం. కానీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో ఉన్నత విద్య శిష్ట ధోరణిని సంతరించుకోకుండా ప్రజాస్వామ్యబద్ధం కావడానికి ముఖ్య కారణం రాజ్యం చొరవే. ఇండియా లాంటి వైవిధ్య సమాజంలో సామాజిక ఆర్థిక రంగంలో బలహీన వర్గాలు చైతన్యవంతులు కావాలంటే ప్రభుత్వమే ఉన్నత విద్యను అందించే బాధ్యతను తీసుకోవాలి.

SAKSHI